# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



మానాలలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు, నాయకులు



పల్లికొండలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వేముల

- వంద కోట్లతో మానాలను అభివృద్ధి చేశా..
- ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నా..
- 2200 ఎకరాల పోడు పట్టాలు అందించాం..
- తండాలను జీపీలుగా మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే..
- ప్రగతి చూసి మరోసారి ఆశీర్వదించండి
- కర్ణాటక, మహారాష్ట్రలో కరెంటు కష్టాలు
- కాంగ్రెస్, బీజేపీ నాయకులు చూసి వచ్చి మానాల స్తూపం వద్ద నిజం చెప్పండి
- బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- మానాలతోపాటు గిరిజన గ్రామాలు, భీమ్‌గల్ మండలంలో ఎన్నికల ప్రచారం

కమ్మర్‌పల్లి, నవంబర్ 11 : 'మానాలను అభివృద్ధి పథంలో నిలుపుతానని మాటిచ్చాను..రూ.100కోట్లతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన.. చెప్పిన మాట నిలబెట్టుకున్న..మీ కండ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించండి..' అని బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని మానాలతో పాటు బడితండా, దేగావత్‌తండా, భీమ్‌గల్ మండలం పల్లికొండ, బాచన్‌పల్లి, పిప్రి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు, మహిళలు మంగళహారతులు, బతుకమ్మలు, బోనాలు, డప్పుచప్పుళ్లతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మానాల గిరిజనులను కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ ఓట్ల కోసం వాడుకున్నాయే తప్ప అభివృద్ధి అందించలేదన్నారు. మానాలకు బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హయాంలో ముఖ్యమంత్రి చేత హామీ ఇప్పించి మాట తప్పిన చరిత్ర ఆ పార్టీదని విమర్శించారు. కానీ స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సహకారంతో గిరిజన ఆశ్రమ పాఠశాలను నిర్మించడంతోపాటు మానాల మరిమడ్ల రోడ్డు నిర్మించి గిరిజనుల 60 ఏండ్ల కలను నెరవేర్చామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మానాలకు 2200 ఎకరాల పోడు పట్టాలు ఇచ్చామన్నారు. ఉమ్మడి మానాల పరిధిలోని 16 తండాల నుంచి 8 తండాలను గిరిజన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. ఫలితంగా ఇక్కడ 8 మంది సర్పంచులు, 8 మంది ఉప సర్పంచులు, 40 మంది వార్డు సభ్యులుగా గిరిజన బిడ్డలు ఎన్నికయ్యే అవకాశం కలిగిందన్నారు. కర్ణాటకలో వ్యవసాయానికి 10 గంటల కరెంటు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఓట్లు వేయించుకొని, అప్పటికే ఉన్న ఏడు గంటల కరెంటును ఎగ్గొట్టిందన్నారు. బీజేపీ అధికారంలోఉన్న మహారాష్ట్రలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావాలంటే రూ.1.80 లక్షలు కట్టాలన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఉచితంగా కరెంటు ఇస్తూ ఉల్టా పైసలను పంట పెట్టుబడికి అందిస్తున్నారని గుర్తు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలో తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు లేవన్నారు. కావాలంటే మానాలకు చెందిన కాంగ్రె స్ నాయకులు ఆ రెండు రాష్ట్రాలకు వెళ్లి వచ్చి మానాలలో అమర వీరుల స్తూపం వద్ద నిజం చెప్పాలని సూచించారు. తాను చెప్పింది నిజమే అయితే వారు కూడా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.



మంత్రి వేముల ప్రచారం సందర్భంగా తరలి వచ్చిన తండాల ప్రజలు

**బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం**

కేసీఆర్ మూడోసారి సీఎం కాగానే ఐదేండ్లలో పింఛను రూ.5 వేలకు, రైతు బంధు రూ.16 వేలకు పెరుగుతుందని తెలిపారు. భూమి లేని వారు దురదృష్టవశాత్తు ఎలా మరణించినా రైతు బీమా మాదిరిగానే కేసీఆర్ బీమా పథకం కింద రూ.5 లక్షలు అందిస్తారన్నారు. ఎలాంటి పింఛన్‌రాని మహిళలకు ప్రతి నెలా రూ.3 వేలు సౌభాగ్యలక్ష్మి పథకం కింద అందజేస్తారని తెలిపారు. మానాలలో ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మోసపు మాటలు నమ్మవద్దన్నారు. అభివృద్ధిని చూసి, ఆలోచించి ఓటేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కోటపాటి నర్సింహనాయుడు, తండాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి నాయక్, నాయకులు నరేశ్ నాయక్, రాజారామ్, భూమా నాయక్, లక్కాకుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధిచేసిన వారిని ఆదరించాలి**

భీమ్‌గల్, నవంబర్ 11 : అభివృద్ధి చేసిన వారిని ఆదరించాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ, బాచన్‌పల్లి, పిప్రి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మూడు గ్రామాల్లో గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో చేసి అభివృద్ధి ప్రజల కండ్ల ముందే ఉన్నదని తెలిపారు. అభివృద్ధిని గుర్తించి కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు.


# ప్రచారంలో కారు జోరు

- నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం
- వేములను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థన



నల్లూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు

మెండోరా/ మోర్తాడ్/బాల్కొండ/ ఏర్గట్ల, నవంబర్ 11 : బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా పార్టీ శ్రేణులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. గ్రామాల్లో గడపగడపకూ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. కారు గుర్తుకు ఓటు వేసి వేముల ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. మెండోరా మండలంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రచారం చేపట్టారు. మోర్తాడ్ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ గెలిస్తే కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో సర్పంచ్ బోగ ధరణీ ఆనంద్, ఎంపీటీసీలు రాజ్‌పాల్, జేసీ గంగా రెడ్డి, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. బాల్కొండ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వేముల ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఏర్గట్ల మండల కేంద్రంలో జడ్పీటీసీ సభ్యుడు గుల్లే రాజేశ్వర్ ఆధ్వర్యంలో గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. వేములను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, పార్టీ రైతు విభాగం మండల అధ్యక్షుడు కోలిప్యాక శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు నేరేళ్ల నరేందర్‌రెడ్డి, ఏలేటి బాలకిషన్ రెడ్డి, లింబాద్రి పాల్గొన్నారు.



ఏర్గట్లలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

**మైనార్టీల ఇంటింటా ప్రచారం**

ముప్కాల్, నవంబర్ 11 : ముప్కాల్ మండలంలోని నల్లూర్, నాగంపేట్, రెంజర్ల గ్రామాల్లో బీఆర్ఎస్ మైనార్టీ జిల్లా కో-ఆప్షన్ మెంబర్ మోహీస్ ఆధ్వర్యంలో మైనార్టీలు శనివారం ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వేముల ప్రశాంత్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ముప్కాల్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు మునీరుద్దీన్, భీంగల్ మజీత్ సదర్ హైమద్ భాయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మోహినుద్దీన్(చోటు), రఫీ, నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



బాల్కొండ మండలం జలాల్‌పూర్‌లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



మెండోరా మండలం దూద్‌గాంలో..



మోర్తాడ్‌లో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్న బీఆర్ఎస్ యువ నాయకులు